


*(జనవరి 1986, జ్యోతి మాసపత్రికలో ప్రథమ ప్రచురణ)*

*(గత సంచిక తరువాయి)*

## 4

కానీ లాభం లేకపోయింది. "నేనుంచనయ్యా! నువ్వు బుద్ధిగా చదూకో" అని చెప్పి కూతుర్ని వెంటబెట్టుకుని ఊరెళ్ళిపోయాడు ఆయన. అప్పట్నించి ఆ ప్రేక్షకులు ఉత్తరాలు రాసుకుంటూ తృప్తి పడుతున్నారు. మరో ఏడాది తరువాత వాళ్ళ పెళ్ళి జరుగుతుంది. అందరూ వాళ్ళ పెళ్ళి ఆలోచనల్లో ఉండగా అనుకోకుండా వచ్చిపడింది శంకరం పెళ్ళి. నిశ్చయం కాగానే సత్యాన్ని దగ్గరకు పిల్చి "నాయనా! ఏదో నీమాట విని పెళ్ళికి ఒప్పుకున్నాడు వాడు. వాడి పెళ్ళికి నువ్వే పెద్దరికం వహించి ఆ శుభకార్యం జరిపించాలి" అంటూ అన్ని బాధ్యతలూ అప్పగించేసింది శంకరం తల్లి.

పెళ్ళి పెద్దరికం, అందులోనూ మగపెళ్ళివారి వైపు పెద్దరికం అంటే సామాన్యం కాదు. మాంచి పవర్‌ఫుల్ పోస్టు అది. అది తనకు లభించినందుకు సత్యం ఆనందపడలేదు. పైపెచ్చు అదిరిపడ్డాడు. "వద్దమ్మా! నాకొద్దు. మీకు దణ్ణం పెడతానమ్మా" అని వేడుకున్నాడు.

తన స్నేహబృందానికి పెద్దరికం వహించి వహించీ అతని బుర్ర పండిపోయింది. రవిపెళ్ళికి పెద్దరికం వహించి చావు తప్పి కన్నులొట్టపోయినట్లు బోలెడంత అనుభవం సంపాదించుకున్నాడు.

రవి పెళ్ళి వైజాగ్‌లో జరిగింది. "మా బంధువుల సంగతి నేను చూసుకుంటాను. మీ ఫ్రెండ్స్ విషయం నువ్వు చూసుకోవయ్యా" అనేశాడు రవి తండ్రి. "ఓ అలాగే" అని హామీ ఇచ్చేశాడతను.

చూడాల్సిన పనుల్లో అతి ముఖ్యమైనవి రెండు. మొదటిది ఉ ఊ ఎవరిమీదా విరుచుకుపడకుండా చూడటం. రెండవది అతి ముఖ్యమైనది. రవిని కనిపెట్టుకుని ఉండడం.

రవికి నిద్రలో లేచి అటూ ఇటూ వెళ్ళిపోయే అలవాటుంది. ట్రీట్‌మెంట్ తీసుకుంటూనే ఉన్నాడు. కానీ ట్రీట్‌మెంటు దారి ట్రీట్‌మెంటుది, జబ్బుదారి జబ్బుది అయిపోయింది.

కాలేజీలో చదువుకునే రోజుల్లో రవి పడుకున్నాక రూముకి లోపలినుండే తాళం వేసి ఆ కీ తలకింద పెట్టుకుని పడుకునేవాడు సత్యం. నిద్రలేవగానే మొట్టమొదట రవి పక్కవేపు చూసేవాడు. అతనక్కడే ఉన్నాడా సరేసరి. లేదూ లేచి రెండు గదుల్లోనూ వెతికి ఏ మూలో నిద్రపోతున్నా అతడిని లేపి తీసుకొచ్చేవాడు. అలా గడిచిపోయాయి ఆ రోజులు.

కానీ పెళ్ళిలో ఆ సమస్య అంత తేలిగ్గా పరిష్కారం అయేదికాదు. మరొకడు మరొకడు కాదు ఏకంగా పెళ్ళికొడుకు. ఆ మూడుముళ్ళూ పడేదాకా పెళ్ళికొడుకుగారి ఈ సుగుణాన్ని ఎవరికీ తెలీకుండా కాపాడాలి. పెళ్ళిలో నలుగుర్లో తాళాలు వెయ్యడం అదీ బాగుండదు.

ఏం చెయ్యాలా అని తర్జన భర్జన పడి చివరికి ఆ రాత్రి తను రవికి కాపలా కూర్చోవాల్ని నిశ్చయించుకున్నాడు. ఆ ప్రకారమే భోజనాలు అయ్యాక రవి మంచం పక్కన ఛెయిర్ వేసుకుని కూర్చున్నాడు.

"మీక్కూడా పక్క వేయిస్తాం పడుకోండి" అని బలవంత పెట్టిన పెళ్ళి పెద్దతో "అబ్బే వద్దండీ! చిన్నతనం నుంచీ నాకిలా కుర్చీలో నిద్రపోటమే అలవాటు" అని చెప్పి పంపేశాడు.

రాత్రి పది పదిన్నరదాకా సందడిగా ఉన్న ఆ హాలు ఆ తరువాత సద్దుమణిగింది.

అందరూ నిద్రపోయారు.

"నేను నిద్రపోనులేరా! అప్పుడు నీకు సమస్యే ఉండదు. " అన్నాడు రవి.

"కాదులే. నువ్వు పడుకో, రేపు తెల్లారిన దగ్గరనుంచి నీతో బోలెడు పనుంది. ఇప్పుడు మేలుకుంటే రేప్పొద్దున్న కునికిపాట్లు పడతావు" అని నచ్చచెప్పి పడుకోబెట్టాడు సత్యం.

తనుమాత్రం రెప్పవాల్చకుండా ఏదో పుస్తకం చదువుకుంటూ కూర్చున్నాడు. ఎంత నిద్రవస్తున్నా బలవంతాన ఆపుకున్నాడు. తెల్లవారు జామున మూడున్నర దాటింది. అమ్మయ్య! ఇంకెంత ఒక్కగంట ఆగితే వీడిని లేపి నేను పడుకోవచ్చు అనుకుంటూ వెనక్కి చేరబడి కళ్ళు మూసుకున్నాడు. ప్రయాణం బడలిక, అలసట, మంచి నిద్రటైం అన్నీతోడయి మెల్లిగా నిద్రలోకి జారుకున్నాడు.

ఇతనిలా పడుకున్నాడో లేదో లేచాడు రవి. టకటకా నడుస్తూ మేడదిగి కిందకి వచ్చాడు.

ఆ కళ్యాణ మండపంలో క్రిందిభాగం ఆడపెళ్ళివారి మకాం. మేడమీద మగపెళ్ళివారి విడిది. కిందకి వచ్చిన రవి తిన్నగా బావిదగ్గరకు వెళ్ళి నాలుగు చాదలు నీళ్ళు తోడి పక్కనే ఉన్న తొట్లో పోసి అక్కడినుంచి నేరుగా వెళ్ళి వంట చిట్టెమ్మ పక్కన పడుకున్నాడు.

మేడమీద మంచి నిద్రలో ఉన్న ప్రతాప్‌కి ఎందుకో మెలుకువ వచ్చింది. వాచీ చూసుకుని లేచి ఒళ్ళు విరుచుకుని సత్యం ఏం చేస్తున్నాడో చూద్దాం అనుకుని లేచి ఇవతలికి వచ్చాడు. మరుక్షణం అతనిగుండె ఠారుమంది. నిశ్శబ్దంగా వెళ్ళి సత్యాన్ని లేపాడు.

కళ్ళు తెరిచి "ఏమిటి బావా?" అనబోయిన సత్యం ఎదురుగా ఖాళీ మంచం కనిపించడంతో అదిరిపడి లేచి నుంచున్నాడు. నోరు ఎండిపోయింది. ఏడుపొచ్చింది. 'ఛీ! వెధవ నిద్ర' అని తిట్టుకున్నాడు.

అలా తిట్టుకున్నందువల్ల ప్రయోజనం లేదని గ్రహించి ప్రతాప్ చెవిలో గుసగుసలాడాడు. 'అలాగే' అంటూ పై అంతస్తులో వెతకటానికి వెళ్ళాడు ప్రతాప్. క్రిందకి వెళ్ళిన సత్యానికి ఎక్కువ శ్రమ పడకుండానే కనిపించాడు వంటవాళ్ళ వరసలో చివరగా పడుకుని నిద్రపోతున్న ప్రాణమిత్రుడు.

వెంటనే పిల్లిలా వెళ్ళి ఓ చేత్తో నోరు గట్టిగా మూసి రెండో చేతిలోతో వీపు మీద ఒక్కటి చరిచాడు. త్రుళ్ళిపడి లేచి కూర్చున్నాడు రవి.

"శనివెధవా! పైకి పద" మెల్లిగా కసిరాడు సత్యం.

తెలివి తెచ్చుకుని ఒక్క పరుగున మేడమీదకి పరిగెట్టాడు రవి.

"అమ్మయ్య" అనుకుంటూ చెమట తుడుచుకున్నాడు సత్యం. కాళ్ళీడ్చుకుంటూ నాలుగడుగులు వేశాడో లేదో ఎదురయ్యాడు పెళ్ళికూతురి తండ్రి.

పెళ్ళికొడుకు ప్రాణమిత్రుడిని వంటవాళ్ళ దగ్గర చూసిన ఆయన చాలా ఆశ్చర్యపోయాడు. "మీరా! మీరిక్కడ ఏం చేస్తున్నారు?" అడిగాడు ఆశ్చర్యంగా.

ఒక్కక్షణం తడబడిపోయిన సత్యం వెంటనే సర్దుకున్నాడు. "అబ్బే ఏం లేదు. అప్పుడే నాలుగు అయిపోయింది. వంటవాళ్ళు లేచారా లేదా చూద్దామని ఇటు వచ్చాను. బోలెడంత పనుంది. ఇప్పటినుంచి హడావుడీ పడకపోతే పనులు కావు" అనేశాడు.

ఉబ్బితబ్బిబ్బు అయిపోయాడు కన్యాదాత. "దొరల్లా కాలుమీద కాలు వేసుకుని కూర్చుని అదిబాగాలేదు, ఇది బాగా లేదు అని వంకలు పెట్టి వేధించేవాళ్ళే తప్ప ఇలా బాధ్యత వహించిన మగపెళ్ళి వాళ్ళను నేనెక్కడా చూళ్ళేదు" అన్నాడు పరమానందంతో.

"ఇహిహీ!" అని నవ్వేసి వెళ్ళిపోయాడు సత్యం.

పెళ్ళి జరిగిపోయింది.

ఆ రాత్రే శోభనం.

"జాగ్రత్త. నిద్రపోకు" అని ఒకటికి పదిసార్లు హెచ్చరించాడు సత్యం.

"సరే" అని హామీ ఇచ్చాడు రవి.

మాట ఇచ్చిన ప్రకారం తెల్లవార్ఝామువరకా మేలుకున్నాడు. ఇంక తరువాత మాత్రం ఆగలేక నిద్రపోయాడు.

తలుపు శబ్దం అవటంతో ఉలిక్కిపడి లేచాడు. తల విదుల్చుకుని వాచీ చూసుకుని "అయ్యబాబోయ్! ఏడున్నర" అని ఉలిక్కిపడి లేవబోతూ మరోసారి ఉలిక్కిపడ్డాడు.

లేవడానికి తను పడుకుని లేడు. తలుపుకి ఆనుకుని కూర్చునే నిద్రపోతున్నాడు.

"ఛ, దిక్కుమాలిన అలవాటు. పెళ్ళికూతురు ఏమనుకుందో పాపం!" అని తనని నానాతిట్లు తిట్టుకుని పెళ్ళికూతురికోసం మంచం మీదకి చూసిన రవి మూడోసారి ఉలిక్కిపడ్డాడు.

మంచం ఖాళీగా ఉంది. సుజాత ఏదీ? వెళ్ళిపోయిందా? మరయితే తలుపు లోపల గడియపెట్టి ఉందేం? ఏమిటీ మిష్టరీ?

అయోమయంగా లేచి గది నాలుగుమూలలా వెతుకుతూ ఉండగా కనిపించింది తెల్లచీరె కొంగు మంచం కిందనుంచి.

"అదేమిటి?" అనుకుంటూ అయోమయంగా వెళ్ళిచూశాడు. మంచం కింద పడుకుని గాఢనిద్రలో ఉంది సుజాత

అయోమయంగా "సుజీ! సుజీ!" మెల్లగా భుజం తట్టిలేపాడు.

త్రుళ్ళిపడి లేచిన సుజాత మంచం కింద నుంచి ఇవతలికి తీసుకొచ్చాడు.

తలవంచుకుని కూర్చుంది సుజాత.

"సుజీ! మంచం కింద పడుకున్నావేం?" కుతూహలంగా అడిగాడు రవి.

మరింత తలవంచుకుంది.

"మంచం మీద దోమలు కుడుతున్నాయా? మంచం కిందపడుకున్నావు మళ్ళీ రెట్టించాడు.

మెల్లిగా తలెత్తింది. కళ్ళనిండా నీళ్ళు. భార్యని ఆ స్థితిలో చూసి విలవిలలాడాడు రవి. "ఏమిటి సుజా! ఏడుస్తున్నావేం?" అన్నాడు అమిత కంగారుపడిపోతూ.

"మీకు ఓ నిజం చెప్పాలి. మావాళ్ళు మీ నుంచి ఈ నిజం దాచి మీకు నన్నిచ్చి పెళ్ళిచేశారు. నాకు నిద్రలో లేచి అటూ ఇటూ వెళ్ళిపోయే అలవాటుంది. ట్రీట్ మెంట్ ఇస్తూనే ఉన్నారు. అయినా గుణం కనిపించడం లేదు. మీరు నన్ను మన్నించండి. నిద్రలో అటూ ఇటూ వెళ్ళిపోయినా మెలకువగా ఉన్నప్పుడు నేనెంతో మంచిదాన్ని. ఏమిటో చచ్చేంత మొహమాటంగా ఉంది నాకు. మీకు నామీద బాగా కోపం వచ్చిందేమో కదూ!" అంటూ భర్త మొహంలోకి చూసింది.

సంభ్రమాశ్చర్యాలతో భార్యవంక చూస్తున్న రవి పట్టలేనంత సంతోషంతో భార్యని గాఢంగా హృదయానికి హత్తుకున్నాడు. "భగవాన్! నేనెంత అదృష్టవంతుడిని" అన్నాడు పరమానందంగా.

ఆశ్చర్యంగా చూసింది సుజాత. "ఇందులో అదృష్టం ఏముందండీ?" అయోమయంగా అడిగింది.

"అదే సుజా! నాక్కూడా అదే అలవాటుంది. నేనూ నిద్రలో లేచి అటు ఇటు తిరుగుతాను" అన్నాడు గర్వంగా.

నిజం తెలుసుకుని భలే ఆనందపడిపోయింది సుజాత.

"అయితే మనిద్దరం మేడ్ ఫర్ ఈచ్ అదర్ అన్నమాట" అంది సంబరంగా.

"అక్షరాలా అంతే" అంగీకరించాడు రవి. బయటికొచ్చిన వెంటనే సత్యం దగ్గరకి పరిగెట్టి ఈ విషయం చెప్పాడు.

నోరావలించాడు సత్యం. "ఓర్నీ! ఇదేమైనా సమస్య సృష్టిస్తుందేమో అనుకున్నాను. మొత్తానికి భలే తమాషాగా తీరిపోయింది నీ ప్రాబ్లం!" అన్నాడు సరదాగా.

రవి సమస్య అయితే తీరిపోయిందిగానీ పాపం సత్యం అవస్థలు తీరలేదు. పెళ్ళికాగానే హైదరాబాదు వచ్చేశారు దంపతులు. ఆఫీసువాళ్ళని, ఫ్రెండ్స్‌ని పిలిచి డిన్నర్ ఇస్తానన్నాడు రవి.

మళ్ళీ బాధ్యత అంతా సత్యందే పాపం. పరుగులు పెట్టి అన్నీ అరేంజ్ చేశాడు.

ఆదివారం రాత్రి డిన్నర్. ఇంటిముందు షామియానా వేసి లైట్లు పెట్టారు. వంటవాళ్ళొచ్చి ఇంటి వెనుక వంట మొదలుపెట్టారు. అప్పటిదాకా ఉండి వాళ్ళకి కావలసినవన్నీ అందించి సాయంత్రం నాలుగింటికి అర్జెంటుగా కావాల్సివచ్చి బజారు వెళ్ళాడు సత్యం.

వంటవాళ్ళ హెడ్ మైసూర్ పాకం కోసం పంచదార నీళ్ళల్లో పోసి కలుపుతూ పక్కనున్న కూరలు తరిగే మనిషితో బాతాఖానీ వేస్తున్నాడు.

"ప్చ్. టీ.వి.లో ధర్మదాత సినిమా ఉంది. చుద్దామనుకున్నాను" అంది కూరలు తరిగే అమ్మాయి.

"ఆ! పోనిద్దూ. ఏమంత గొప్ప సినిమా గనక! నాకసలు ఆ నాగేశ్వరరావు ఏక్షనంటే ఇష్టంలేదు" అన్నాడు వంటవాళ్ళ ముఠానాయకుడు.

వెనక వరండాలో కూర్చునిపుస్తకం చదువుకుంటున్న ఉ ఊ! ఆ పుస్తకం విసిరికొట్టి విసవిస వాళ్ళ దగ్గరకు వచ్చేశాడు.

"ఏమిటయ్యా! ఏమన్నావు? నాగేశ్వర్రావు ఏక్షను ఇష్టంలేదా?" అన్నాడు గుడ్లెర్రజేసి.

"అవునండీ! నాకిష్టంలేదు. ఏం ఏక్షనూ నా మొహంలా ఉంటుంది" పాకం వచ్చిందో లేదో చూస్తూ సమాధానం చెప్పాడతను.

"ఏమిటేమిటి? నీ మొహంలా ఉంటుందా? అంత ఛండాలంగా ఉంటుందా? నువ్వసలు దేవదాసు చూశావా? పోనీ దేవదాసు మళ్ళీ పుట్టాడు చూశావా? భగ్న ప్రేమికుడిగా నటనలో ఆయనకి ఆయనేసాటి. అటువంటి మహానటుడిని పట్టుకుని అలా నీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడతావా?" అంటూ యుద్ధానికి బయలుదేరాడు.

ఆ వంటతనికి చిరాకేసింది. "ఇది మరీ బాగుందండీ. ఎవరి ఇష్టం వాళ్ళది. నా అభిప్రాయం చెప్పాను. దానికోసం మీరిలా పోట్లాడ్డం ఏం బాగోలేదు" అన్నాడు.

మాటా మాటా పెరిగింది. ఆవేశంగా వంటతని మీదకి వెళ్ళి అతని చేతిలో అట్లకాడలాక్కుని అతని బుర్రమీద ఠంగున ఒకటి తగిలించాడు ఉమాకాంతం.

వాళ్ళకి బాగా కోపాలొచ్చేశాయి. మనమీద చెయ్యిచేసుకుంటాడా? ఇక క్షణం కూడా ఉండొద్దు. పదండి పోదాం చేస్తున్న పని వదిలేసి వెళ్ళిపోయారు.

ఇంట్లో వాళ్ళంతా బ్రతిమాలినా విన్లేదు. "ఏదో ఓ అయిదు రూపాయలు తక్కువ ఇస్తానంటే ఒప్పుకుంటాం. ఇప్పుడు డబ్బులేదు నాల్రోజులాగి ఇస్తాం అంటే ఊరుకుంటాం కానీ ఇలా అట్లకాడలూ, బూంది గరిటలూ పెట్టి కొడితే ఊరుకోడానికి మేమేమైనా గాజులు తొడుక్కున్నామా ?" అనేసి వెళ్ళిపోయారు.

సత్యంకి వచ్చీరాగానే విషయం తెలిసింది. అతనికి చాలాకోపం వచ్చింది. "ఛీ! సన్నాసి వెధవా! నీ కోపం తగలబడిపోనూ, వాళ్ళని తగాదా పెట్టుకుని వెళ్ళగొట్టావు ఇప్పుడెలా?" అని తిట్టాడు.

మరింత ధుమ ధుమలాడాడు ఉమాకాంతం.

"వాడు పోతే వాడి తాతలాంటివాడొస్తాడు. లేదా నేనొండిపారేస్తాను ఎడం చేత్తో!" అని పాంటు పైకి మడుచుకుని సిద్ధం అయిపోయాడు. ‘నీ మొహంలే!‘ అనేసి బయటకి పరిగెట్టాడు సత్యం.

ఎవరైనా వంటవాళ్ళు దొరుకుతారేమో అని వెతికాడు కానీ అంత అర్థాంతరంగా అప్పటికప్పుడు ఎవరు దొరుకుతారు? అవతల టైం మించి పోతోంది. గెస్ట్లు వచ్చేవేళ అవుతోంది. ఏం చెయ్యాలో తోచక మళ్ళీ రవి దగ్గరకు వచ్చేశాడు.

"ఏం చేద్దాం? ఏదైనా హోటల్కి ఆర్డరిద్దామన్నా వ్యవధి లేదు" అన్నాడు. "ఇది మరీ బాగుంది! బాధ్యత అంతా నీకు అప్పజెప్పేక అంతా నువ్వు చూసుకోవాలిగానీ ఇలా అభాసు చేసేసి నన్ను సలహా అడిగితే నేనేం చేస్తాను?" అని మండిపడ్డాడు రవి.

వీళ్ళిలా తర్జన భర్జనలు పడుతూ ఉండగానే అతిధుల రాక మొదలైంది. అవతల ఉమాకాంతం వంటకూడా పూర్తిచేసేశాడు. అన్నం గుండిగ అత్తెసరుగా ఉడకేసి దించి కిందపడేశాడు. మిగిలినవన్నీ కూడా తనకి తోచిన రీతిన వండిపారేశాడు. "ఒరేయ్! వంటైపోయింది" అని అల్టిమేటమ్ ఇచ్చేశాడు.

ఆ వంట వడ్డించటానికి మొహమాటపడిపోయారు వడించేవాళ్ళు. భోజనం చేస్తూ పబ్లిగ్గానే విసుక్కున్నారు అతిధులు. రవి మూడ్ పూర్తిగా పాడైపోయింది. ‘బ్రహ్మాండంగా బహుమతులు అందుకుని నానా చెత్తభోజనం పెట్టి పంపించారని‘ తిట్టూకున్నారు అందరూ. రేపు నేను ఆఫీసులో తలెత్తుకోగలనా?" అని గోలపెట్టేశాడు.

"ఇదంతా ఈ సత్యంగాడివల్లే జరిగింది. మరి బాధ్యత వహించాక అన్నీ తిన్నగా చూసుకోవద్దూ?" అన్నాడు శంకరం.

ఈ జరిగిన అనుభవాలవల్ల తలపట్టిపోయిన సత్యం మళ్ళీ శంకరం పెళ్ళి పెద్దరికం కూడా తన నెత్తిన పడేసరికి నాకొద్దు మొర్రోమని మొత్తుకున్నాడు. కానీ ఆడపెళ్ళివాళ్ళు అంగీకరించలేదు. ఇక్కడ ఉన్న సౌకర్యం మాకు అక్కడేలా ఉంటుంది? దూరమో భారమో మీరు రావలసిందే రావడానికి చార్జీలు మీరు పెట్టుకోండి. తిరుగుప్రయాణానికి మేము ఇస్తాం" అన్నారు. మొత్తానికి పెళ్ళి ఆ ఊళ్ళో జరగాలని సెటిల్ అయిపోయింది.

●●●

(కొనసాగింపు వచ్చేసంచికలో)

Click here to share your comments on this serial